క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రచారం నిర్వహిస్తున్న భూషణం మాస్టారు

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పర్యావరణ ప్రేమికుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇంటూరి భూషణం అన్నారు. 90వ వార్డు పరిధిలోని బుచ్చిరాజుపాలెం(ఏపీ ఎస్‌ఈబీ కాలనీ)లో సోమవారం పర్యావరణ పరిరక్షణ- మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు చక్కటి వాతావరణం సమకూరుతుందన్నారు. ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించి ఇళ్ల ముందు మొక్కలు నాటాలన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఈసేవను స్వామికి జరిపించారు. వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం సంకల్పం, కంకణదారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో అర్చకులు శాస్త్రోక్తంగా కల్యాణంనిర్వహించారు. లక్ష్మీకాంత్‌నాయక్ దంపతులు వింజామరతో స్వామికి సేవలందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్ అదృశ్యం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్‌కు చెందిన కానిస్టేబుల్ ఆర్.రాజేంద్రరావు (36) అదృశ్యమైన ఘటనపై స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా తెర్లాం మండలం వెలగవలసకు చెందిన రాజేంద్రరావు స్టీల్‌ప్లాంట్ యూనిట్‌లో పనిచేస్తూ అక్కడి బ్యారక్స్‌లో ఉంటున్నారు. రాజేంద్రరావు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో బ్యారక్స్ నుంచి లుంగీతో బయటకు వెళ్లిన రాజేంద్ర తిరిగి బ్యారక్స్‌కు చేరలేదు. దీంతో సీఐఎస్‌ఎఫ్ ఎస్‌ఐ అందించిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ పాత్రుడు నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు తెలియజేయాలని కోరుతున్నారు.

5న హాజరు కావాలి

ఉక్కు యాజమాన్యానికి ఆర్‌ఎల్‌సీ ఆదేశం

అగనంపూడి: ఉక్కు కార్మికుడు నాట్ర తాతారావుతో 29 సంవత్సరాలు పని చేయించుకుని, వచ్చిన జీతంలో నిబంధనల మేరకు పీఎఫ్ కోత విధించినా నెలవారి పింఛన్ చెల్లింపులో ఉక్కు యాజమాన్యం, పీఎఫ్ అధికారులు కప్పదాటుగా వ్యవహరిస్తున్న తీరుపై రీజనల్ లేబర్ కమిషనర్ ఈ నెల 5వ తేదీన హాజరు కావాలని ఉక్కు అధికారులను ఆదేశించారు. వాస్తవంగా ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసిన కార్మికులకు 58 సంవత్సరాలు దాటిన తరువాత జాతీయ భద్రతా పెన్షన్ పథకంలో కనీస పింఛన్ చెల్లించాలి. అయితే ఈ విషయంలో ఉక్కు అధికారులు, ఈపీఎఫ్ అధికారుల ద్వంద్వ వైఖరిపై తాతారావు ఆర్‌ఎల్‌సీకి ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన 5న హాజరు కావాలని ఆదేశించారు. అలాగే దేవర అప్పలకొండ అనే వితంతువును ఆమె ఆధార్ కార్డు ఆధారంగా చేసుకుని విధుల నుంచి తొలగించడంపై కూడా ఉక్కు యాజమాన్యం హాజరు కావాలని ఆర్‌ఎల్‌సీ ఆదేశించింది.

కౌంటింగ్ డౌన్

పారిశ్రామిక ప్రాంతం.. విభిన్న సంస్కృతులు కల గలిసిన విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితం ఉత్కంఠగా మారింది. మరి కొద్ది గంటల్లో విజేత ఎవరన్నది తేలనున్న నేపథ్యంలో అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల కార్యకర్తలు, ప్రజల్లో సైతం ఫలితాలపై చర్చనడుస్తోంది. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే పోటీ ఉంది. అభ్యర్థులకు వచ్చిన ఓట్లు ఇప్పటికే ఈవీఎంలలో భద్రంగా ఉండగా, వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు గెలుపుపై ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు.

- నేడే ఎన్నికల ఫలితాలు
- పశ్చిమంలో 'ఆనంద'ం కోసం ఎదురుచూపు
- ఈ సారి పీఠం తమదేనంటున్న ఇరుపార్టీలు
- నరాలు తెగే ఉత్కంఠ



ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే బీఆర్‌టీఎస్ రోడ్

విశాఖ విద్య/కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్ల లెక్కింపు మంగళవారం జరుగనుంది. పశ్చిమ నియోజకవర్గ ఓటర్లు ఇచ్చిన తీర్పుపై రెండు పార్టీల వారు నరాలు తెగే ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. 2019 కంటే ఏకంగా 11.64 శాతం మేర పోలింగ్ పెరగడంతో పాటు, వృద్ధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున ఓటు వేసేందుకు తరలి వచ్చారు. ఓటర్లలో వచ్చిన చైతన్యం ఎవరి విజయానికి మలుపు కానుందనేది నేడు వెల్లడికానుంది.

కేడర్‌లో టెన్షన్ .. టెన్షన్

టీడీపీ నుంచి బరిలో నిలిచిన గణబాబు హ్యాట్రిక్‌కు బ్రేకులు పడతాయా..? అనూహ్య రీతిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ విజయదుందుబి మోగిస్తారా..అనే దానిపైనే జోరుగా బెట్టింగ్‌లు సైతం సాగుతున్నాయి. పశ్చిమంలో అందరి కళ్లలో 'అనంద'ం వెల్లి విరియాలనే ప్రజానీకం ఎదురుచూస్తున్నారు.

గెలుపుపై ఎవరికి వారే ధీమాగా..

పశ్చిమ నియోజకవర్గంలో 2,13,439 మంది ఓటర్లు ఉండగా, ఈ సారి జరిగిన ఎన్నికల్లో 222 బూత్‌లలో 1,48,942 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 నాటి ఎన్నికల్లో జిల్లాలోని మిగతా నియోజకవర్గాల కంటే పశ్చిమంలోనే అతి తక్కువ పోలింగ్ శాతం నమోదైంది. కానీ ఈ సారి పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. గెలుపుపై ఇదే ఎవరికి వారిలో ధీమాను కలిగిస్తుంది. సంక్షేమం అందుకున్న ఓటర్లు రాష్ట్రంలో మరోమారు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్షతోనే పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారని వైఎస్సార్ సీపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రెండు సార్లు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా విజయం సాధించిన గణబాబు, హ్యాట్రిక్ కోసం ఆరాటపడుతున్నారు. ఇరువురిలో పశ్చిమ పీఠం ఎవరిని వరించనుందో నేడు తేలిపోనుంది.

14టేబుళ్లు.. 16 రౌండ్లు

పశ్చిమ నియోజకవర్గంలో 1,48,942 మంది ఓటు వేశారు. అదే విధంగా 2,276 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వచ్చాయి. ఎన్నికల బరిలో 16 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ ప్రధాన వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే నెలకొంది. ఆంధ్రాయూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు గదులు కేటాయించారు. వాటిలో ఒక గదిలో పోస్టల్ బ్యాలెట్లు లెక్కించనున్నారు. మరో మూడు గదుల్లో ఈవీఎంలలో నమోదైన ఓట్లు లెక్కిస్తారు. పశ్చిమలోని 220 పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు లెక్కించడానికి 14 బెంచీలు ఏర్పాటు చేశారు. 16 రౌండ్లలో లెక్కించనున్నారు. మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9 గంటలకు వెలువడే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పూర్తి స్థాయి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

సిబ్బంది..ఏజెంట్లు ఇలా చేరుకోవాలి

పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సిబ్బంది, పోటీ చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్లు , పోస్టల్ బ్యాలెట్ సిబ్బంది త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ జంక్షన్ నుంచి ప్రయాణించి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి వైవీఎస్ మూర్తి ఆడిటోరియం వైపు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది.

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించవద్దు

సీఐ సనావుల్లా



పోలీస్ సిబ్బందికి పలు సూచనలిస్తున్న సీఐ సనావుల్లా

మల్కాపురం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్న నేపథ్యంలో స్టేషన్ పరిధి ప్రాంతాలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని మల్కాపురం స్టేషన్ సీఐ సనావుల్లా అన్నారు.స్టేషన్ సిబ్బందితో పాటు ప్రత్యేక పోలీస్ బలగానికి ఆయన పలు సూచనలు చేశారు. ప్రకాష్‌నగర్‌లో సోమవారం ఆయన సిబ్బందికి పలు సూచను చేశారు. విజయం సాధించే పార్టీల వారు సంబరాలు,ర్యాలీలు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంలో వివాదాలు తలెత్తకుండా స్టేషన్ సిబ్బందితో పాటు ప్రత్యేక బలగాలతో పలు ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు.144 సెక్షన్ అమల్లో ఉన్నందున ముగ్గురు వ్యక్తులకు మించి జనం గుంపుగా ఉన్నా.. బాణసంచా కాల్చినా,ర్యాలీలు నిర్వహించినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.స్టేషన్ పరిధిలో ఆకతాయిలు,అల్లరి మూకలు ఏదైనా ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు.

వెంకటాపురంలో ఫ్లాగ్ మార్చ్



గోపాలపట్నం నుంచి వెంకటాపురం వరకు ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం నుంచి వెంకటాపురం వరకు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీసీ అన్నెపు నరసింహమూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గోపాలపట్నం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. డీసీపీ వెంకటరత్నం మాట్లాడుతూ కౌంటింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సామరస్యంగా మెలగాలని సూచించారు. నగరంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ఎక్కువ మంది గుమిగూడకూడదని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్‌ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, పెందుర్తి సీఐ రామకృష్ణ ఎస్‌ఐలు, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

కథా రచన ఒక కళ



శిబిరం నిర్వాహకులను అభినందిస్తున్న హరివెంకట్

మల్కాపురం: కథలు రాయడం ఒక కళ ...,కొన్ని నియమాలు పాటిస్తే కథలు అద్భుతంగా వస్తాయని రచయిత హరి వెంకట్ అన్నారు.వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా మల్కాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం స్టోరీస్ రైటింగ్ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న హరి వెంకట్ మాట్లాడుతూ కథను చిన్న చిన్న పేరాలుగా రాయాలని, చక్కని టైటిల్ పెట్టాలని,కథలో మలుపు ఉండాలని,అక్షర దోషాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన కథను ఎలా రాయాలో,ఎలా కొనసాగించాలో, ఎలా ముగించాలో శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు వివరించారు.కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి,ప్రముఖ చిత్రకారుడు మనోహర్,రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిశుగృహ సందర్శన



ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందితో స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ విజయ

మర్రిపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోనూ చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ల(సీసీఐ)ను స్కీమ్స్ అధికారులు సందర్శించారు. అందులో భాగంగానే సోమవారం 53వ వార్డు మర్రిపాలెంలోని మహిళా శిశుగృహ కేంద్రం, మహిళా హాస్టల్‌ను సోమవారం స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ ఎ.విజయ సందర్శించారు. శిశు గృహ కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, వారి సంరక్షణ కోసం ఆరా తీశారు. పలు దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీడీపీవో రమణకుమారి, నోడల్ అధికారి శ్రీకళ, డీసీపీవో లక్ష్మి, పీవో(ఎస్ఐసీ) మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న వైర్లు తొలగించారు



రోడ్డుపై ప్రమాదకరంగా వైర్లు



తొలగించిన తర్వాత ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ సమీపంలోని ఫుట్‌ఫాత్‌పై స్తంభానికి ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లను తొలగించేలా జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. 'వేలాడుతున్న వైర్లు' అనే శీర్షికన గత నెల 31న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. మర్రిపాలెం వైపు నుంచి ఎన్ఏడీ సెంటర్‌కు వచ్చేదారిలో నడిచే వారికి తగిలేలా ఓ స్తంభానికి వైర్లు వేలాడుతున్నాయి. అటుగా వెళ్లే వారు దీనిపై ఆందోళన వ్యక్తం చేసినా జీవీఎంసీ అధికారులు ఇన్నాళ్లు తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో స్పందించారు.వేలాడుతున్న వైర్లను తొలగించారు.

ఉక్కు ఆస్పత్రి హెచ్‌వోడీకి అభినందనలు



ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి నవీన్‌కుమార్‌ను అభినందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ.పి.నవీన్‌కుమార్‌ను స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని విభాగాధిపతిని కోరారు. ఆస్పత్రిలో వైద్యుల నియామకం చేపట్టాలని, పారామెడికల్ సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ఎస్.ఎ.నాయుడు, బి.ఎస్.రాజు, బి.టి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కార్మికులకు యూనిఫారాల పంపిణీ



కార్మికులకు యూనిఫారాలు అందిస్తున్న హెచ్‌పీసీఎల్ సీజీఎం కిరణ్‌కుమార్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో పని చేస్తున్న సీఎల్‌డబ్ల్యూ (సొసైటీ)కార్మికులకు పరిపాలన భవనం వద్ద సోమవారం సీజీఎం (హెచ్‌ఆర్)కిరణ్‌కుమార్ యూనిఫారాలు అందించారు. ఆయన మాట్లాడుతూ సంస్థను నమ్ముకుని పని చేస్తున్న సొసైటీ కార్మికుల సంక్షేమ చూసుకోవడం యాజమాన్యం బాధ్యత అన్నారు. దానిలో భాగంగా వారందరికీ యూనిఫారాలు అందించామన్నారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్.వి.రమణయాదవ్ మాట్లాడుతూ కార్మికుల పట్ల యాజమాన్యం చూపుతున్న అభిమానం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ శ్రీకాంత్,దివాకర్ తదితరులు మాట్లాడారు.కార్యక్రమంలో సొసైటీ పాలక వర్గ సభ్యులు ఎన్.పైడిరాజుయాదవ్,బి.చిన్నారావు,వై.ఎ.భాస్కరరావుయాదవ్,డైరక్టర్లు చెల్లుబోయిన శ్రీను యాదవ్,సర్వసిద్ధి శ్రీనివాస్‌రావుయాదవ్,వై.అప్పలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం

- స్టీల్ సీఐటీయూ పిలుపు
- 14న రక్తదాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టీల్ సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రక్షణకు రక్తదానం చేద్దామని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. సీఎంఎస్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 2018 నుంచి స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ జూన్ 14న డాక్టర్ అంబేడ్కర్ కళాక్షేత్రంలో జరిగే రక్తదానం కార్యక్రమంలో ప్రతీ కార్మికుడు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, కె.గంగాధర్, టి.వి.కె రాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా జీవిద్దాం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బాలభాను విద్యాలయంలో నగరంలోని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకో వైజాగ్ విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై పూర్తి అవగాహన పెంచుకుని తమ తోటివారితోపాటు తల్లిదండ్రులకు దీని ప్రాధాన్యాన్ని తెలియజేయాలని కోరారు.

150 మంది విద్యార్థుల హాజరు

చిత్రలేఖనం పోటీల్లో 51 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా శబ్ద, వాయు, జల కాలుష్యాల నివారణకు పౌరులు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరిస్తూ చిత్రాలు వేశారు. చిత్ర కళాకారుడు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ డబ్బీరు ఉదయ భాస్కరరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రెండు విభాగాలుగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. వాకర్స్ డిస్ట్రిక్ట్-101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్ విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

కూరగాయలు, ఆకుకూరల విత్తనాల పంపిణీ

విశిష్ట అతిథి గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యాన్ని వివరించి విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు ఎకో వైజాగ్‌లో భాగంగా కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలభాను విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ మనోరమణి, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాసరాజు, యూనివర్సల్ యూత్ వాకర్స్ అధ్యక్షుడు సిహెచ్.వంశీకృష్ణ వర్మ, మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి సిహెచ్.లక్ష్మి, కోశాధికారి పి.కమల, వైస్ ప్రెసిడెంట్ టి.లీలా నాయుడు, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, సంయుక్త కార్యదర్శి ఎ.రాధ, సుభాషిణి, మురళీనగర్ గార్డెనింగ్ గ్రూప్ ప్రతినిధి ఎ.అరుణ, సి.శైలజ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- రహదారిపైనే వాహనాల పార్కింగ్
- ఎన్ఏడీలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు
- అధికారులు హెచ్చరించినా తీరుమారని వైనం



బాజీ జంక్షన్‌లో ఫుట్‌పాత్‌పైనే ఓ షోరూమ్ నిర్వాహకుల వాహనాలు



ఓ ప్రైవేటు స్కూల్ వద్ద తరచూ ఇదే తీరు

విశాఖ విద్య: ఎన్ఏడీ కూడలికి ఇరువైపులా ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్‌లోని ఫుట్‌పాత్‌లను బడా వ్యాపారులు ఆక్రమించారు. ఫలితంగా ట్రాఫిక్ ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయి. ఎన్ఏడీ సెంటర్ నుంచి అటు గోపాలపట్నం వైపు, ఇటు మర్రిపాలెం వైపు ప్రయాణం సవ్యంగా సాగడం లేదు.

ఇదీ పరిస్థితి

విద్య,వ్యాపార,వాణిజ్య పరంగా ఎన్ఏడీ సెంటర్‌కు రోజూ వేలాది మంది రాకపోకలు సాగిస్తారు. అయితే కొంతమంది బడా వ్యాపారులు తమ దుకాణాల ముందు ఉన్న ఫుట్‌ఫాపాలను ఆక్రమించడంతో పాటు వారికి సంబంధించిన వాహనాలను సైతం బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో సాయంత్రం వేళలో ఎన్ఏడీ సెంటర్ నుంచి గోపాలపట్నం వైపు వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు దుకాణదారులను హెచ్చరించారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా మళ్లీ రోడ్డుపైకి వచ్చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు మళ్లీ మొదటికొస్తున్నాయి.

నడక సాగేదెలా

బీఆర్‌టీఎస్ రోడ్‌కు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను జీవీఎంసీ అధికారులు ఇటీవల ఆధునీకీకరించారు. పాదచారులకు సౌకర్యవంతంగా ఉండేందుకు చక్కగా తీర్చిదిద్ది అందమైన రంగులు కూడా వేశారు. కానీ చాలాచోట్ల వీటిని ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తుండడంతో పాదచారులు నడిచే పరిస్థితి లేదు. ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేసి రంగులు వేయడం వరకే తమపని అన్నట్లు ఆక్రమణలను పట్టించుకోకుండా జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందిస్తేనే ..

ఎన్ఏడీ సెంటర్ రోజురోజుకు జనసంచారం అధికమవుతోంది. దీంతో ప్రజానీకం ప్రయాణం సవ్యంగా సాగేలా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రధానంగా ఫుట్‌పాత్ ఆక్రమణలపై జీవీఎంసీ జోనల్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. సమస్య జఠిలం కాకుండా నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించాలని పాదచారులు,వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపైనే ఇలా పార్కింగ్



మర్రిపాలెం వైపు రోడ్‌లో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి స్టోర్ చేసిన సరకులు

ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు

మర్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పోలీస్ సిబ్బందితో బందోబస్తు పగడ్బందీగా నిర్వహించామని, విధుల నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని క్రైం డీసీపీ వెంకటరత్నం సూచించారు. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బందితో సోమవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులో ఉన్నందున కౌంటింగ్ రోజున బందోబస్తు విధులు సక్రమంగా నిర్వర్తించాలని, ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి సంఘటనలు జరిగినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడికక్కడ పోలీస్ పికెటింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యలు సృష్టించే వ్యక్తులు, రాజకీయ నాయకుల నివాసాల వద్ద మొత్తం 300 మంది పైగా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై అనుక్షణం నిఘా ఉంచాలని సిబ్బందికి క్రైం డీసీపీ ఆదేశించారు. సమావేశాన్ని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి పర్యవేక్షించారు. సీఐలు, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.